క్లుప్తంగా

చిన్నారులకు గ్రహణమొర్రి చికిత్సలు


గ్రహణమొర్రి పరీక్షలకు హాజరైన చిన్నారులు

మదనపల్లె సిటీ : స్థానిక అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో బుధవారం చిన్నారులకు గ్రహణమొర్రి చికిత్సలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన కిండర్ ఉమెన్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఆకాష్ పరీక్షలు చేశారు. ఇందులో 30 మందిని గుర్తించగా 16 మంది అర్హులుగా నిర్ధారణ చేశారు. వీరికి బెంగళూరులో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామని వెలుగు కన్వీనర్ ఉదయమోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ నాగేంద్రప్రసాద్, మోహన్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవాలు


మాట్లాడుతున్న సీడీపీఓ రాజమ్మ

పీలేరు : స్థానిక ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బుధవారం గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ రాజమ్మ మాట్లాడుతూ ఆకు కూరలు, వివిధ కాలాల్లో లభించే పండ్లు ఆహారంగా తీసుకోవాలన్నారు. సూక్ష్మ పోషకాలు, పీచు పదార్థం కలిగిన ఆహారం ఆరోగ్యానికి మంచిదన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ ద్వారా 1/3 వంతు పోషకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి సేకరణ


మట్టిసేకరణ కార్యక్రమంలో ఐటీబీపీ అధికారులు, విద్యార్థులు

పీలేరు రూరల్ : ఆజాదీక అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా భూమి నాదేశం.. నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం ద్వారా కర్తవ్య పథ్ అమృత వాటిక స్తూపానికి మట్టి సేకరించారు. బుధవారం మండలంలోని రేగళ్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలికిరి ఐటీబీపీ ఆధ్వర్యంలో మండలంలో ర్యాలీ నిర్వహించారు. ఈ మట్టిని ఢిల్లీకి పంపుతున్నట్లు ఐటీబీపీ ఇన్స్‌పెక్టర్ వై.వి.రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి, హెచ్‌ఎం పార్వతమ్మ, పంచాయతీ కార్యదర్శి అయ్యప్ప, రేగళ్లు, బాలంవారిపల్లె గ్రామ సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : పీలేరు నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీ జనాభా అధికంగా ఉండడంతో ముస్లిం మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంతోపాటు పరిసర మండలాల్లోనూ అత్యధికంగా ముస్లిం మైనారిటీలు ఉన్నారని తెలిపారు. ముస్లిం మైనారిటీ విద్యార్థులు ఉర్దూ మీడియంలో విద్యనభ్యసించాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉందన్నారు. ప్రభుత్వం దృష్టి సారించి పీలేరులో ముస్లిం మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.

మూడో విడత డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

వాల్మీకిపురం : స్థానిక ఎన్‌టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో విడత అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ జె. కృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9440080402 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

స్పెషల్ సర్వీసు బస్సులకు ఆదరణ

మదనపల్లె సిటీ : ఆర్టీసీ నడుపుతున్న స్పెషల్ సర్వీసు బస్సులకు మంచి ఆదరణ లభిస్తోందని ఆర్టీసీ 1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం డిపో కార్యాలయంలో ట్రాఫిక్, గ్యారేజ్ సూపర్‌వైజర్లు, మార్కెటింగ్ టీంతో సమావేశం నిర్వహించారు. స్పెషల్ సర్వీసులు అరుణాచలం, శబరిమలైకు నడుపుతున్నామన్నారు. బస్సులు ఎక్కువ బుక్ చేసి డిపో ఆదాయం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రేవతి, డీఎంఈ మధుసూదన్, ఎంఎస్‌యు రెడ్డప్ప, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మూడు చక్రాల సైకిల్ అందజేత

- జగనన్నకు చెబుదాంలో వాహనం కోసం వినతి
- తక్షణమే స్పందించిన ఆర్డీఓ ఎం.ఎస్.మురళి


దివ్యాంగుడు మల్లికార్జునకు మూడుచక్రాల సైకిల్‌ను అందజేస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, డీఏఓ శేషయ్య

మదనపల్లె : జగనన్నకు చెబుదాం కార్యక్రమం సత్ఫలితాన్నిస్తోంది. ప్రజాసమస్యల పరిష్కారం కోసం స్పందన కంటే మరింత మెరుగైన వ్యవస్థను తీసుకురావాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో సమస్యలను నేరుగా లేదా 1902 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయడం ద్వారా బాధితులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చు. ఈ విధంగా వచ్చిన సమస్యను కాల్‌సెంటర్ లేదా ప్రభుత్వ అధికారి తక్షణమే సంబంధిత శాఖల అధికారులకు సమాచారం తెలిపి, సమస్య పరిష్కారానికి నిర్దీత గడువు విధించి, పరిష్కారం తర్వాత బాధితుడి స్పందనను తెలుసుకునేలా కార్యక్రమం రూపొందించారు. అలాంటి ఈ కార్యక్రమంలో మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ ఎనుములవారిపల్లెకు చెందిన ఎ.మల్లికార్జున అనే దివ్యాంగుడు 23 ఏళ్లుగా శాశ్వత వైకల్యంతో బాధపడుతున్నాడు. డాక్టర్లు ఇతనికి 100 శాతం వికలత్వ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ క్రమంలో రోజువారి పనులు చేసుకునేందుకు, ఒక చోట నుంచి మరో చోటకు వెళ్లేందుకు తనకు మూడుచక్రాల వాహనం మంజూరు చేయాల్సిందిగా మల్లికార్జున జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించాడు. దివ్యాంగుడి అర్జీపై తక్షణమే స్పందించిన ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అక్కడికక్కడే మూడుచక్రాల వాహనాన్ని అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. బుధవారం సబ్ కలెక్టరేట్‌లో దివ్యాంగుడు మల్లికార్జునను పిలిపించి ప్రత్యేకంగా తెప్పించిన మూడుచక్రాల సైకిల్‌ను అందజేశారు. బ్యాటరీ వాహనం ఇప్పించేందుకు దివ్యాంగశాఖకు అర్జీని పంపుతామని, అప్పటివరకు దీన్ని వాడుకోవాల్సిందిగా చెప్పారు. దీంతో ట్రై సైకిల్‌ను అందుకున్న మల్లికార్జున సంతోషానికి అవధులు లేవు. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ సంతోషంగా వాహనాన్ని ముందుకు నడిపించాడు. ఈ సందర్భంగా మల్లికార్జున కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్డీఓ ఎం.ఎస్.మురళీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డీఏఓ శేషయ్య పాల్గొన్నారు.

30న జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు


బలకవారిపల్లె ఉన్నత పాఠశాలలో క్యాంపు నిర్వహణను పరిశీలిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత మెడికల్ క్యాంపు ఈనెల 30వ తేదీ బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీ బలకవారిపల్లె ఉన్నత పాఠశాలలో జరుగుతుందని డాక్టర్ అనుమప, ఎంపీడీఓ సురేంద్రనాథ్‌లు తెలిపారు. బుధవారం బాలిరెడ్డిగారిపల్లె ఆరోగ్య ఉపకేంద్రం, బలకవారిపల్లె ఉన్నత పాఠశాలలో క్యాంపు ఏర్పాటును పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకూ 20వేల పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ తెలిపారు. డాక్టర్ ఆశాలత, సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో థ్యాంక్యూ జగనన్న కార్యక్రమం

మదనపల్లె : పాస్టర్లకు ఐదునెలల గౌరవవేతనం విడుదల చేసినందుకు కృతజ్ఞతగా, త్వరలో జిల్లాలోని క్రైస్తవులు, పాస్టర్లతో ఆత్మీయ సమావేశంతో పాటు థ్యాంక్యూ జగనన్న కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు బోనాసి జాన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం సూచనలతో మదనపల్లె, రాయచోటి పట్టణాల్లో 10వేల మంది క్రైస్తవులతో ఆత్మీయసమావేశాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో చర్చి పాస్టర్లు, క్రైస్తవ నాయకులను కలుపుకుని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల ద్వారా క్రైస్తవ సమాధుల స్థలాలను ఏర్పాటు చేసేందుకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళతామన్నారు. క్రైస్తవ సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ప్రతి ఒక్కరూ సీఎం జగనన్నకు మద్దతు తెలపాల్సిందిగా కోరారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


మహిళ సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జి.వి. రాకేష్‌రెడ్డి

పీలేరు : అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.వి. రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం పీలేరు పట్టణం రాజీవ్‌నగర్ కాలనీలో ఇంటింటికీ పర్యటన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు వివరించడం తోపాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ నిండు మనస్సుతో ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, నాగరాజ, కాలనీ చిన్న, చలపతి, మోహన, మహేశ్వర్‌రెడ్డి, సహదేవరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, షాకీర్, హబీబ్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

మీ–సేవలో అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు

ఈఎస్‌డీ, డీఎల్‌డీఓ లక్ష్మీపతి


పాన్నూటిపాళ్యంలో మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఈఎస్‌డీ, డీఎల్‌డీఓ లక్ష్మీపతి

మదనపల్లె : మీ సేవ కేంద్రాల నిర్వాహకులు నిర్ధారిత ధరకు మించి అధిక రుసుము వసూలు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఈఎస్‌డీ, డీఎల్‌డీఓ లక్ష్మీపతి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని అమ్మచెరువుమిట్ట, పాన్నూటిపాళ్యంలోని మీసేవ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 52 మీ సేవా కేంద్రాల్లో సిటిజన్‌చార్ట్ ప్రదర్శించాలన్నారు. ఆధార్ సహా ఇతర సర్వీసులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలు మాత్రమే తీసుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే కేంద్రాలు రద్దుచేస్తామన్నారు.

నిధుల వినియోగంపై విచారణ చేయండి

రాయచోటి అర్బన్ : 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరపాలని ఏపీ గ్రామపంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకట్రామయ్య డిమాండ్ చేశారు.

బుధవారం ఆయన తమ సంఘం నేతలతో కలసి డీఆర్‌ఓ సత్యనారాయణను కలిశారు. ఆయన మాట్లాడుతూ సీఐటీయూ ఆందోళనల ఫలితంగా గ్రామాల్లో పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులకు రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ జిల్లా కలెక్టర్‌లు, డీపీఓలకు ఆదేశాలను జారీ చేశారు. కాగా అన్నమయ్య జిల్లాలో జిల్లా పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కుమ్మక్కై, కార్మికులకు జీతాలివ్వకుండా వాటిని పక్కదారి పట్టించారంటూ ఆరోపించారు. అధికారులు కార్మికులకు పూర్తిస్థాయిలో జీతాల చెల్లింపుపై దృష్టిసారించాలని, లేనిపక్షంలో సమ్మెబాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్‌నాయక్, నేతలు రెడ్డెయ్య, ఆంజనేయులు, నాగబసిరెడ్డి, రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.

29న నెట్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ : అండర్–14, 17 నెట్‌బాల్ బాల, బాలికల జిల్లా జట్టు ఎంపిక ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపికలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు హాజరు కావాలని కోరారు.

నూతన కార్యాలయం కోసం ప్రతిపాదనలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట నగర పంచాయతీకి నూతన కార్యాలయం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని కమిషనర్ పి.ఆర్.మనోహర్ తెలిపారు. మేజర్ పంచాయతీ నుంచి అప్‌గ్రేడ్ అయిన నగర పంచాయతీకి అధికారులు, ఉద్యోగులకు తగినట్టుగా భవనం లేదన్నారు. దీంతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సూచన మేరకు నివేదికను తయారుచేసి రెండు రోజుల క్రితం మున్సిపల్‌శాఖకు పంపామన్నారు. దీనికోసం రూ.4 కోట్లు మంజూరు చేయాలని నివేదించినట్టు తెలిపారు.

నగర పంచాయతీ ఏఈగా రాజేంద్ర



బి.కొత్తకోట : బి.కొత్తకోట నగర పంచాయతీ ఇంజినీరింగ్ విభాగం ఏఈగా ఎస్.రాజేంద్ర బుధవారం కమిషనర్ పీఆర్ మనోహర్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. సత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపాలిటీలో ఏఈగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ ఎఫ్ఏసీ ఏఈగా పనిచేస్తున్న ఆంజనేయులు ప్రజారోగ్యశాఖ ఏఈగా తిరిగి వెనక్కి వెళ్లారు.

రీ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

పుల్లంపేట : ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రీ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని అన్నమయ్య జిల్లా రెవెన్యూ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజ్ అన్నారు. బుధవారం స్థానిక పుల్లంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూములకు సంబంధించి రీ సర్వే ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. సర్వేకు సంబంధించి ముందస్తు ప్రణాళికతో చేపడుతున్నామని ప్రతి గ్రామ పంచాయతీని రీసర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ రహదారికి సంబంధించి రీసర్వే పూర్తయ్యిందని, రైతులకు సంబంధిత నగదు వారి ఖాతాలలో జమ చేశామన్నారు. ఇంకా ఎవరికైనా రైతులకు అందకుంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. నిర్దేశించిన గడువులోపు సర్వే పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ నరసింహ కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉరుసు

రాయచోటి : పట్టణంలోని పాతరాయచోటిలో ఉన్న హజరత్ జమాలుల్లా బాబా దర్గా ఉరుసు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్గాలోని బాబా మజార్లతో పాటు దర్గా ఆవరణాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. పాతరాయచోటి పీర్లమకాన్ నుంచి జెండాను ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాకు చేర్చారు.

పశువైద్య సేవలు అందించడం ఇలాగేనా?

బి.కొత్తకోట మండల మీట్‌లో సర్పంచులు


సేకరించిన మట్టిని అప్పగిస్తున్న ప్రజాప్రతినిధులు

బి.కొత్తకోట : మండలంలో పశువులకు వైద్య సేవలు అందించడంలో పశువైద్యులు విఫలమవుతున్నారని బీరంగి, శీలంవారిపల్లె సర్పంచులు వెంకటరమణ, భీమగాని నాగిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెబుతున్నారు, అవి ఎక్కడ పెడుతున్నారో కనీసం సర్పంచులకు కూడా తెలియడం లేదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పశువైద్య సేవల సమాచారం ఇవ్వడం లేదన్నారు. సమావేశాల్లో చెప్పడం తప్ప ఆచరణలో కనిపించడం లేదన్నారు. దీనిపై చర్యలు తీసుకుని పశువైద్య సేవల గురించి గ్రామాల్లో ప్రచారం చేయాలని కోరారు. యూరియా కొరత ఉందని రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ మండల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. జెడ్పీటీసీ రామచంద్ర, సింగిల్‌విండో చైర్మన్ అమరనాథ్ మాట్లాడుతూ అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి చూపాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శంకరయ్య, వైస్ ఎంపీపీలు రాధ, ఖాదర్‌వలీ, ప్రత్యేక ఆహ్వానితుడు అరుణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, పాల్గొన్నారు. అనంతరం మండలంలోని 15 పంచాయతీల నుంచి సేకరించిన మట్టిని ఢిల్లీకి తరలించేందుకు అధికారులకు అప్పగించారు.

విద్యార్థిని మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్‌యూఐ నాయకులు


మాట్లాడుతున్న విద్యార్థి విభాగం నాయకుడు నరేష్

పీలేరురూరల్ : చిత్తూరు జిల్లా పెనుమూరులో విద్యార్థి భవ్యశ్రీ మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృత్ తేజ కోరారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి విద్యార్థిని మృతికి గల కారణాలు వెలికి తీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు శ్రీకాంత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుల్ని కఠినంగా శిక్షించాలి

కలికిరి : పెనుమూరు మండలం గోపాలపురంలో ఇంటర్మీడియట్ విద్యార్థిని భవ్యశ్రీపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం కలికిరిలో భవ్యశ్రీ చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు.

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు తెలపండి


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

పీలేరు : పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం 163కు సంబంధించి పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 280 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. మండలంలో 72 బూత్‌లు ఉన్నట్లు తెలిపారు. 1500 ఓట్లకు మించిన పోలింగ్ కేంద్రాలను పునర్విభజన చేస్తారన్నారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏవైనా సమస్యాత్మకంగా ఉన్నా, అభ్యంతరాలు ఉన్నా తమ దృష్టికి తేవాలని కోరారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అమర వీరుల చిత్రపటాలతో విద్యార్థుల ర్యాలీ


పెద్దతిప్పసముద్రంలో జరిగిన ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెద్దతిప్పసముద్రం : మేరా మిట్టి–మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆజాదీకా అమృత్ కలశ్‌లో భాగంగా మట్టిని కలశంలో భద్ర పరచి అమర వీరుల చిత్ర పటాలతో మేరా మిట్టి–మేరా దేశ్ అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించామని ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు. అలాగే మండలంలోని పట్టెంవాండ్లపల్లి, కమ్మచెరువు, పులికల్లు, కందుకూరు గ్రామాలలో వైస్ ఎంపీపీ పట్టెరిక శోభా, శంకర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది మట్టిని సేకరించారు. ఈ మట్టిని మండల కేంద్రంలోని ఈఓఆర్డీకి అందజేస్తారని ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనం


రామసముద్రం : నిమజ్జనానికి తరలిస్తున్న ఆంజనేయస్వామి కాలనీ బొజ్జగణపయ్య


వాల్మీకిపురం : గణేష్ విగ్రహం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

రామసముద్రం : రామసముద్రం మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి కాలనీలోని బొజ్జగణపయ్యను బుధవారం అంగరంగ వైభవంగా నిమజ్జనానికి తరలించారు. యువకులు, మహిళలు సైతం ఎంతో సంతోషంగా ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ వినాయకుడిని ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.


వైభవంగా వినాయక చవితి పూజలు


వాల్మీకిపురం : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కొత్తపేట వీధిలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద విశేష పూజలు నిర్వహించారు. బుధవారం వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాద వినియోగం, అన్నదానం చేపట్టారు. అనంతరం నిర్వహించిన భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో భక్తులు, కొత్తపేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.


29న డివిజనల్ స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం

మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో ఈనెల 29వతేదీ శుక్రవారం సబ్ కలెక్టరేట్‌లో డివిజనల్ స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ తెలిపారు. బుధవారం విజిలెన్స్ కమిటీ సమావేశానికి సంబంధించి ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే డివిజనల్ స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశానికి డివిజన్ పరిధిలోని కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజాసంఘాలు, ఎస్సీ, ఎస్టీ హక్కుల కోసం పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరు కావాల్సిందిగా కోరారు.

నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు


మెకానిక్‌లతో మాట్లాడుతున్న ఎస్ఐ రహీముల్లా


ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి


అవగాహన కల్పిస్తున్న సీఐ సురేష్‌కుమార్

కలికిరి : నిబంధనలు పాటించని వాహనాల డ్రైవర్లు, యజమానులపై కఠిన చర్యలుంటాయని ఎస్ఐ కె.రహీముల్లా హెచ్చరించారు. ఎల్లమ్మ ఆలయ ఆవరణలో మండల పరిధిలోని ట్రాక్టర్ల డ్రైవర్లు, ఓనర్లతో సమావేశం నిర్వహించి, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. రాత్రి పూట ఇతర వాహదారులకు కనపడేలా రేడియం స్టిక్కర్లను అంటించాలన్నారు. వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులైనా, మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడినా చర్యలుంటాయన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో కలికిరిలోని ద్విచక్రవాహనాల మెకానిక్‌లతో సమావేశం నిర్వహించి ద్విచక్రవాహనాలకు అధిక శబ్దాన్నిచ్చే సైలెన్సర్లు అమర్చడం చట్టవిరుద్ధమని తెలిపారు. కార్యక్రమాలలో ఏఎస్ఐ మధుసూదనాచారి, హెచ్‌సీ కొండప్ప, పీసీలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సూచనలు

పీలేరు రూరల్ : ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కడపరోడ్డు మార్గంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలు నడపాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా ఆటో ఎక్కితే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, బిస్మిల్లా ఆటోయూనియన్ అధ్యక్షుడు బోదే షావలి, నాయకులు ఖాసీం, సుబ్బారావు, వెంకటేష్, లవకుమార్, శివనాగరాజు, చంద్ర, మాధవ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వాల్మీకిపురం : ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని సీఐ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ట్రాక్టర్ల డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవర్లు విధిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని ఆదేశించారు. సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ట్రాక్టర్ల ట్రాలీకి రేడియం స్టిక్కర్లు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గుర్రంకొండ విద్యార్థి


సయ్యద్ ఉస్మాన్

గుర్రంకొండ : రాష్ట్రస్థాయిలో జరిగే వాలీబాల్ పోటీలకు గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్‌కు చెందిన విద్యార్థి సయ్యద్ ఉస్మాన్ ఎంపికైనట్లు పీడీ రమేష్‌బాబు తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 జిల్లాస్థాయి వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని దుర్గసముద్రంలో ఇటీవల నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో 9 వతరగతి చదువుతున్న సయ్యద్ ఉస్మాన్ మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో జరిగే వాలీబాల్ పోటీలకు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పీడీ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థిని హెడ్మాస్టర్ హమీద్‌బాషా, ఉపాధ్యాయులు త్రినాథ్, రెడ్డిమోహన్, మదన్‌మోహన్‌లు అభినందించారు.